సాక్షి తిరుపతి

బుధవారం । 18 । జూన్ । 2025



‘గిట్టుబాటు’ కాని మాటలు

జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కలగా మారింది. మంత్రి హామీ అమలు కాకపోవడంపై మండిపడుతున్నారు. - 8లో



రూ.కోట్ల జాగాపై కన్ను

రూ.కోట్లు విలువ జేసే కార్పొరేషన్ జాగాను తక్కువ ధరకు కొట్టేసేందుకు కూటమి నేతలు కుట్రకు తెరతీశారు. - 8లో



మామిడి రైతును ఇబ్బంది పెట్టొద్దు

జిల్లాలోని మామిడి రైతులను ఫ్యాక్టరీ నిర్వాహకులు ఇబ్బందులు పెట్టొద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

కోవిడ్‌పై అప్రమత్తత



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీ డైరెక్టర్ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఆసుపత్రి అధికారులు కోవిడ్‌పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ అధికారులు, వైద్యులకు పలు సూచనలు చేశారు. స్విమ్స్ హాస్పిటల్ నందు కోవిడ్ పేషెంట్లకు కావాల్సిన వైద్య సామగ్రి, బెడ్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కోవిడ్ పేషెంట్ల కోసం ప్రస్తుతం ఉన్న 6 బెడ్లను మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో కోవిడ్ వచ్చినప్పుడు స్విమ్స్ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించారని కొనియాడారు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సమంత్ రే, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరమణ, కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్, డాక్టర్ రామకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, వైద్యులు పాల్గొన్నారు.

అర్హులకు గురుకుల సీట్లు



టి.పద్మజ, డీసీఓ

తిరుపతి అర్బన్ : గురుకుల పాఠశాలకు సంబంధించి అర్హులందరికీ సీట్లు కేటాయిస్తామని గురుకుల పాఠశాలలు, కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ (డీసీఓ) టి.పద్మజ వెల్లడించారు. మంగళవారం డీసీఓగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా డీసీఓగా పనిచేసిన ఆమె నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. విజయవాడ నుంచి గీత తిరుపతికి వచ్చారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో గీత మళ్లీ విజయవాడకు వెళ్లారు. పద్మజ నెల్లూరు నుంచి తిరుపతికి విచ్చేశారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ.. గురుకులాల్లో ఖాళీలకు సంబంధించి నిర్వహించిన పరీక్షల ఆధారంగా మార్కుల ప్రకారం గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేస్తున్నామని స్పష్టం చేశారు.

జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : యువజన సర్వీసులు, క్రీడల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి టెన్జింగ్ నార్వే జాతీయ సాహస పురస్కారం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో ఏదైనా సాహస కృత్యంలో ప్రతిభ సాధించిన వారు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత దరఖాస్తులను వెబ్‌సైట్‌లో ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక వ్యక్తిగతంగా తమ దరఖాస్తులను సెట్విన్ కార్యాలయం, అలిపిరి రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, తిరుపతిలో జిల్లాలోని అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోపు అందజేయాలని, అయితే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో 30వ తేదీలోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 94405 73537ను సంప్రదించాలని కోరారు.

అస్తవ్యస్త బడి



కేవీబీపురం మండలం తిమ్మ సముద్రం పాఠశాల ముందు ఆందోళనకు దిగిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- కేవీబీ పురం మండలంలోని గురుకుల కండ్రిగ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 53 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ రెండు పాఠశాలలను ఆయా గ్రామాలకు సుమారు 7 కిలో మీటర్లు దూరంలోని కల్లపూడి పాఠశాలలో విలీనం చేశారు. అక్కడికి కనీసం వాహన సదుపాయం కూడా లేదని, తమ బిడ్డలను ఏడు కిలోమీటర్లు పంపడం ఎలా సాధ్యమవుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ గురుకుల కండ్రిగ పాఠశాలకు మంగళవారం తాళం వేసి ఆందోళనకు దిగారు.
- డక్కిలి మండలం వెలికల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను జాతీయ రహదారి పక్కన ఉన్న మార్లగుంట పాఠశాలకు విలీనం చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోను నిలదీశారు. ప్రభుత్వం మోడల్ స్కూళ్లు ఏర్పాటుచేసి అక్కడికి విలీనం చేసిందని, తప్పకుండా అక్కడికి రావాల్సిందేనని సమాధానం చెప్పారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. విలీనం నిలిపేసి యధావిధిగా పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.
- దొరవారిసత్రం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో, కుప్పారెడ్డిపాళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఏకొల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. అదే మండలం ఎస్ఎం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను అక్కరపాక ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. ఈ విలీనం చేసిన పాఠశాలలకు తమ బిడ్డలను పంపడం సాధ్యం కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో ప్రభుత్వ బడులకు తాళాలు పడేలా వ్యవహరిస్తోంది. దీంతో ఉన్న ఊరులో బడులు మూత పడుతుండడంతో తల్లిదండ్రులు రోడ్డెక్కి ఆందోళన బాట పడుతున్నారు. కూటమి సర్కారు అస్తవ్యస్త నిర్ణయాలు ప్రభుత్వ బడులకు ఉరి తాడుగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కళకళలాడగా నేడు కూటమి పాలనలో సర్కారు బడులు మూత బడి వెలవెలబోతున్నాయి.

చిన్నారులకు విలీనబడి కష్టాలు

- మూతబడుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- ప్రైవేటుకు మళ్లించేందుకు కూటమి కుట్ర
- ఆందోళన బాటలో తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్సార్‌సీపీ హయాంలో సర్కారు బడులు పూర్వ వైభవాన్ని సంతరించుకుని విద్యార్థులతో కళకళలాడాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారు. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యతో పాటు మౌలిక వసతులు పెరిగాయి. అప్పటి ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియను తప్పు పడుతూ అప్పటి ప్రతిపక్ష టీడీపీ విమర్శలు గుప్పించింది. ప్రభుత్వ బడులు అస్తవ్యస్తం అవుతున్నాయంటూ నానా యాగీ చేసింది. అధికారంలోకి వస్తే సర్కారు బడుల విలీనం ఉండదని అప్పట్లో చంద్రబాబు , లోకేష్ హామీలు గుప్పించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి వెంటనే ప్లేటు ఫిరాయించి జిల్లాలో సర్కారు బడుల విలీన ప్రక్రియను చేపట్టి చకచకా పూర్తి చేయడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత విద్యా విధానంలో 9 అంచెల పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రాథమిక స్థాయిలో ఫౌండేషన్, బేసిక్, మోడల్ స్కూల్స్ పేరుతో విలీన ప్రక్రియకు తెరలేపి పేద విద్యార్థులను, వారి తల్లిదండ్రులను రోడ్లపై తీసుకొచ్చేలా చేశారు.

విద్యారంగం నిర్వీర్యం

ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యేలా గతంలో టీడీపీ అనేక చర్యలు చేపట్టింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చి విద్యా రంగాన్ని గాడిలో పెట్టి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం గత టీడీపీ పాలనను గుర్తుకు తెచ్చేలా ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు విద్యారంగ నిపుణులు, మేధావులు, వివిధ ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. 9 అంచెల విధానాన్ని పాఠశాల విద్యలో తీసుకొచ్చి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందంటూ ఆరోపిస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిందిబోయి విలీనం పేరుతో ప్రభుత్వ బడులకు తాళాలు పడేలా నిర్ణయాలు తీసుకుంటోంది.

580 స్కూళ్లు విలీనం

ఎన్నికల సమయంలో విలీనం చేయబోమని కూటమి హామీ ఇచ్చి నేడు ఆ హామీని తుంగలో తొక్కింది. జిల్లాలోని ప్రతి మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలను నెలకొల్పడంతో దాదాపు 580కి పైగా ప్రైమరీ పాఠశాలలు విలీనమయ్యాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపకుండా సమీపంలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తుండడం గమనార్హం.



దొరవారిసత్రం ప్రాథమిక పాఠశాల వద్ద పిల్లలతో తల్లిదండ్రుల నిరసన



డక్కిలి: వెలికల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

జిల్లాలోని ప్రభుత్వ బడుల సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
ప్రాథమిక	1817	47,998
ప్రాథమికోన్నత	194	13,983
ఉన్నత	323	74,689
మొత్తం	2334	1,36,695

వేల మందికి బడి దూరం

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విలీన ప్రక్రియతో బడికి దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. విలీన ప్రక్రియతో జిల్లా వ్యాప్తంగా సర్కారు బడులు ప్రారంభంలోనే బోసిపోయి కనిపిస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి ఆఘమేఘాల మీద దొంగ సంతకాలు చేయించుకుని సర్కారు బడులను విలీనం చేశారు. తల్లిదండ్రుల సమ్మతి లేకుండా బడులను విలీనం చేసేశారు. ప్రస్తుతం బడులు పునఃప్రారంభం అయ్యాక తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం చేసిన అసలు విషయం బయటపడింది. జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లో విలీన ప్రక్రియ చేపట్టి 613 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపకుండా ఆందోళన బాట పట్టారు.

విద్యాసంవత్సరం ప్రారంభంలో పలకా, బలపం చేతబట్టి పాఠాలు నేర్చుకోవాల్సిన చిన్నారులు తమ పాఠశాలను కొనసాగించండి అంటూ బడులు మాని ఆందోళనలు చేస్తున్నారు.

ప్రైవేటు స్కూళ్లే దిక్కు



దొరవారిసత్రంలోని ప్రాథమిక పాఠశాలలను ఏకొల్లులో కలపడం వల్ల అంత దూరం పిల్లలను పంపించలేం. ప్రైవేటు పాఠశాలలోనే చదివించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందరి అభిప్రాయాలు సేకరించి చర్యలు చేపట్టాలి.

– షేక్ నూరుల్లా, దొరవారిసత్రం

విద్యార్థులు బడికి వెళ్లలేరు



క్లస్టర్ పేరుతో పాఠశాలలను కలపడం వల్ల విద్యార్థులు బడికి పోరు. గ్రామాల్లో అధిక సంఖ్యలో డ్రాపౌట్లు పెరుగుతారు. పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షాలా మారుతుంది. కూటమి ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల విద్యార్థులకు చదువు భారమే అవుతుంది.

– షేక్ నజీమా, దొరవారిసత్రం

కార్పొరేషన్ ఆస్తులు అమ్మితే ఊరుకోం

- వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక



కార్పొరేషన్ ఆస్తి విక్రయ సమాచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి కల్చరల్ : నగరం నడిబొడ్డున ఉన్న కోట్ల రూపాయల విలువైన కార్పొరేషన్ ఆస్తులను విక్రయిస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి వాసు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ ఆస్తుల విక్రయం సమాచార కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం జరగనున్న కార్పొరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుతం చాణిక్య లాడ్జిగా నున్న స్థలాన్ని అమ్మడానికి చేయనున్న తీర్మానాన్ని వైఎస్సార్‌సీపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన అత్యంత విలువైన స్థిరాస్తి చాణిక్యలాడ్జి భూమి 924 అంకనాల ఆస్తి అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ అంకనం రూ.15 లక్షలు పలుకుతోందని, అయితే ప్రభుత్వ ధర రూ.60 వేలు అంకనంగా పేర్కొంటూ ఆ స్థలాన్ని అమ్మకానికి తీర్మానం తీసుకురావడం కూటమి ప్రభుత్వం భారీ కుంభకోణానికి నిదర్శనమన్నారు. నగర పాలక సంస్థ చేపడుతున్న నూతన పరిపాలన భవనానికి నిధుల కొరత సాకుతో కూటమి నేతలకు కట్టబెట్టే ప్రయత్నానికి తెర తీస్తున్నారని ఆరోపించారు. గతంలో యువనేత భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో రోడ్లను విస్తీర్ణం చేయడమేకాక, కార్పొరేషన్‌కు నిధులు కొరత లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్పొరేషన్ ఆస్తులు అమ్మకం నిర్ణయాన్ని మానుకోకపోతే ప్రజలతో కలిసి భూమన అభినయరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు రవిశంకర్, రమణారెడ్డి, తేజ రాయల్, బాలాజీ, నరేష్ పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకుంటాం : కలెక్టర్

- తోతాపురి కిలో రూ.8కి కొనాల్సిందే..
- రైతుల సమస్యలకు కంట్రోల్ రూమ్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావుతో కలసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే తోతాపురికి కిలో రూ.4 ప్రభుత్వ ప్రోత్సాహకంతో కలిపి పడుతుందని స్పష్టం చేశారు. సర్కార్ కిలోకు రూ.4 ఇస్తుందని, ఫ్యాక్టరీల నుంచి కేజీకి రూ.8 ఇప్పించడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు కొందరు కిలో రూ.5, రూ.6కి మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోందని చెప్పారు. అలా కాకుండా కిలో రూ.8 కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కొనుగోలు చేసిన తర్వాత 10 రోజుల్లోపు రైతుకు ఫ్యాక్టరీ వారు చెల్లింపులు చేయాలని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వద్ద పల్ప్ నిల్వ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బ్యాంక్ రుణాలు కంతుల వారీగా చెల్లించాల్సిన నేపథ్యంలో వారికి గడువు ఇప్పించామని వివరించారు. జిల్లాలో 8 ఫ్యాక్టరీలు ఉన్నాయని...రోజుకు 2వేల టన్నులు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. చివరి గడువు అంటూ లేదని అందరి రైతుల నుంచి కొనుగోలు చేస్తామని వెల్లడించారు. మామిడి రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 87722 36007కు కాల్ చేస్తే.. సమస్యకు పరిష్కారం చూపుతారని స్పష్టం చేశారు. కొనుగోలు సమయంలో ఫ్యాక్టరీ వద్ద ఉద్యానశాఖ, అగ్రికల్చర్, రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులు ఉంటారని చెప్పారు. జిల్లాలో 24 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉన్నప్పటికి 3 వేల హెక్టర్ల పంటకు ఈకేవైసీ చేయించుకోకపోవడంతో వారికి సర్కారు ఇచ్చే రూ.4 రాయితీ రాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

పీఎం శ్రీకి షాక్

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలను విస్మరిస్తున్న టీడీపీ

- తల్లికి వందనం ఇవ్వకుండా ఎగనామం
- రగిలిపోతున్న బీజేపీ నేతలు
- కేవీఎస్ విద్యార్థులు



చిత్తూరు కలెక్టరేట్/ తిరుపతి ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం బీజేపీకి షాక్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయకుండా నాన్చుతోంది. ఎన్నికల ముందు మేనిఫెస్టో ప్రకటించే సమయంలో బీజేపీ మేనిఫెస్టోకు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలకు పథకాలు ఇవ్వకుండా మినహాయించింది. ఫలితంగా వేలాది మంది పేద విద్యార్థులు అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకత్వం ఈ నెల 21న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పీఎంకు ఈ మెయిల్స్ పంపిస్తున్నారు. అయితే పీఎం కార్యాలయం నుంచి విద్యార్థులకు, ఆ పాఠశాలలకు ఇంకా ఎలాంటి సమాధానం రాలేదు. ఈ సమాచారం అందుకున్న కూటమి ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను, తల్లిదండ్రులను సచివాలయాల్లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం తల్లికి వందనం దరఖాస్తులను ఆయా బడుల్లోనే చేసుకోవాలని వెనక్కి పంపించేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలలకు సమాచారం చేరవేశారు. ఈ సమయంలో ఈ పథకం వర్తింపుపై బీజేపీ శ్రేణులే చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

లోలోపలే కక్ష సాధింపులు

పైకేమో కూటమి సర్కారు అంటూ ఆర్భాటాలు...లోపలేమో కక్ష సాధింపులు. తాజాగా విడుదలైన తల్లికి వందనం పథకంలో సెంట్రల్ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం మంజూరు చేయని దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని యాజమాన్యాల పిల్లలకు అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. ఇప్పుడు తమతో పాటే ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్ల టీడీపీ కక్ష సాధింపు ధోరణి చేస్తోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్స్ లో వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒక్క విద్యార్థికి కూడా తల్లికి వందనం మంజూరు కాకపోవడం చర్చనీయంశంగా మారింది. ఎన్నికల సందర్భంగా టీడీపీ రూపొందించిన మేనిఫెస్టోను బీజేపీ విస్మరించడంతోనే ఇలా కక్షసాధింపు చర్యలకు దిగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వేల మందికి నష్టం

తిరుపతి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం పరిధిలో పీఎం శ్రీ పాఠశాలలు 2, రేణిగుంటలో 1, ఏర్పేడు ఐఐటీలో 1, వెంకటగిరిలో 1 మొత్తం 5 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 30 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒక్క విద్యార్థికి సైతం తల్లికి వందనం నగదు ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు కల్పిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలు వెల్లడించింది.నగరి నియోజకవర్గానికి చెందిన చిరంజీవిని రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా, పలమనేరు నియోజకవర్గానికి చెందిన నాగరాజును రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, కుప్పం, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన రాజ చంద్రశేఖర్‌గౌండర్, వెంకటరమణయ్య, జయరామయ్యను రాష్ట్ర కల్చరల్ వింగ్ కార్యదర్శులుగా నియమించినట్టు పేర్కొంది.

ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: డీబీటీ బిల్డర్ ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్‌గా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహిళా వర్సిటీ డీబీటీ ప్రాజెక్ట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలు కాల పరిమితి కలిగిన ప్రాజెక్ట్ కోసం ప్రాజెక్ట్ అసోసియేట్‌గా ఒక పోస్టును భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను గానీ, 93938 67573, 90146 53764 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రీ స్కూల్ భవితకు పునాది



సెమినార్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ : బాల్యదశలో విద్యార్థులను క్రమశిక్షణతో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ప్రీ స్కూల్ టీచర్లదే ప్రధాన పాత్ర అని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. పద్మావతి మహిళా వర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ రాష్ట్రీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా వర్సిటీ వేదికగా మంగళవారం శ్రీలంక ప్రీ స్కూల్ టీచర్లకు చైల్డ్ డెవలప్‌మెంట్ ఫర్ ప్రీస్కూల్ టీచర్స్ అనే అంశంపై ఉపాధ్యాయులకు ఒకరోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరయ్యారు. చిన్నపిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ప్రీ స్కూల్ టీచర్లేనని కొనియాడారు. అనంతరం శ్రీలంక హెచ్ఈఎఫ్‌సీవైఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎంఎండబ్ల్యూబీ గల్కాడువా మాట్లాడుతూ.. శ్రీలంక టీచర్లకు వర్సిటీలో శిక్షణ పొందే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. సెమినార్‌లో రిజిస్ట్రార్ రజిని, లా విభాగాధిపతి ప్రొఫెసర్ సీతాకుమారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుందరవల్లి, ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఉష, శోభారాణి, రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు, శ్రీలంక ప్రీ స్కూల్ టీచర్ల బృందం పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,01,830
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,207
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,09,800
రిటైల్ వెండి గ్రాము రూ.112.80

క్లుప్తంగా

జిల్లా స్పోర్ట్స్ అధికారిగా శశిధర్



జిల్లా స్పోర్ట్స్ అధికారిని శశిధర్‌ను సత్కరిస్తున్న పలు క్రీడా సంఘాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : జిల్లా స్పోర్ట్స్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శశిధర్‌ను తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను పలు క్రీడా సంఘాల ప్రతినిధులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అధికారి శశిధర్ మాట్లాడుతూ.. క్రీడా అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సత్కరించిన వారిలో ఒలపింక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి సాయికుమార్, ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, శాప్ కోచ్‌లు మాలిని, ఆది, ప్రేమ్, గోపి, హరి, హిందూజా ఉన్నారు.

న్యాయవాది కారులో రూ.లక్ష చోరీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట న్యాయస్థానం సమీపంలో న్యాయవాది ఓల్లురు రాజమాణిక్యం కారును పార్కింగ్ చేసి రూ.లక్ష నగదును కారులో పెట్టి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతి రూరల్ మండలం అవిలాల ఆంధ్రాబ్యాంక్ కాలనీకు చెందిన రాజమాణిక్యం తిరుపతి న్యాయస్థానంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. నాయుడుపేట న్యాయస్థానంలో పనిమీద మంగళవారం నాయుడుపేట కోర్టుకు వచ్చారు. అతడి వద్ద ఉన్న రూ.లక్ష నగదు అతడి కారు డాష్ బోర్డులో పెట్టి లాక్ చేశారు. పని చూసుకుని తిరిగీ వచ్చే సరికే కారు అద్దాలు పగులు గొట్టి డాష్ బోర్డులో పెట్టిన రూ.లక్ష నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుడికి రిమాండు

శ్రీకాళహస్తి : దోపిడీ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న నిందితుడు హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. దోపిడీ కేసులో ఏఎం పుత్తూరుకు చెందిన హేమంత్‌కు అరెస్టు వారెంట్‌ను కోర్టు ప్రకటించగా అతడు కోర్టుకు హాజరు కాలేదన్నారు. దీంతో మంగళవారం పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు.

రూ.కోట్ల జాగాపై కన్ను

- తిరుపతి మున్సిపల్ స్థలాన్ని విక్రయించేందుకు భారీ స్కెచ్
- గాంధీ విగ్రహం సమీపంలో కార్పొరేషన్‌కు ఖరీదైన స్థిరాస్తి
- ఓ మంత్రి అండదండలతో అమ్మకానికి సిద్ధమైన యంత్రాంగం
- విధి విధానాలు లేకుండా కౌన్సిల్ ఆమోదానికి సన్నద్ధం



స్థలం : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్
స్థలం ఎక్కడంటే : గాంధీ విగ్రహం దక్షిణం వైపు
విస్తీర్ణం : 77 సెంట్లు (924 అంకనాలు)
సబ్ రిజిస్ట్రార్ విలువ (ఒక అంకనం) : రూ. 2.40 లక్షలు
ప్రస్తుత మార్కెట్ విలువ (అంకనం) : సుమారు రూ.12 లక్షలు
924 అంకనాలకు ప్రస్తుత విలువ: రూ.110 కోట్లకు పైమాటే

తిరుపతి తుడా : తిరుపతి నడిబొడ్డున అభివృద్ధి చెందిన ప్రాంతమది. ఇక్కడ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రూ.110 కోట్లకు పైగా విలువ చేసే కమర్షియల్ స్థలం ఉంది. ఈ స్థలానికి కూత వేటు దూరంలో ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్, ప్రసిద్ధి చెందిన మోడ్రన్ రైల్వే స్టేషన్, ప్రముఖ గోవిందరాజస్వామి ఆలయం ఉన్నాయి. ఇదే స్థలంలో 1965లోనే మున్సిపాలిటీ స్థాయిలో విశ్రాంతి అతిథి గృహంగా దశాబ్దాల పాటు సేవలందించింది. ప్రస్తుతం ఈ స్థలంపై కూటమి ప్రభుత్వం కన్నుపడింది. కోట్ల విలువ చేసే ఈ స్థలంపై భారీ స్కెచ్ వేసి తక్కువ ధరకే కొట్టేసేందుకు కుట్రకు తెరలేపారు. ఇందుకు అధికారులు వత్తాసు పలుకుతూ అమ్మకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చకచకా చేసేస్తున్నారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఖరీదైన స్థలాన్ని విక్రయించేందుకు అధికారులు, పాలకులు కుమ్మక్కై భారీ స్కెచ్ వేశారు. తిరుపతి నడిబొడ్డున గాంధీ విగ్రహానికి దక్షిణం, ఈస్ట్ పోలీ స్టేషన్‌కు ఆనుకుని తూర్పు వైపున 77 సెంట్ల కమర్షియల్ భూమి కార్పొరేషన్‌కు ఆర్థిక స్థిరాస్తి వనరుగా ఉంది. ఈ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వంలో కీలక మంత్రి ఒకరు ఎత్తులు వేశారు. కార్పొరేషన్ నూతన భవనాన్ని నిర్మించుకునేందుకు నగదు లేనందున ఈ స్థలాన్ని విక్రయించి తద్వారా వచ్చే డబ్బుతో పనులు పూర్తి చేయాలని సాకుగా చూపుతున్నారు. దీని వెనుక భారీ కుట్ర దాగి ఉందని కూటమిలోని ఓ వర్గం వాపోతోంది. ఆ స్థలాన్ని ఎలాగైనా కాజేసి విద్యా సంస్థలకు అనుకూలంగా భవనాన్ని నిర్మించుకోవాలన్న ఎత్తుగడకు అధికారులు వత్తాసు పలకడం విమర్శలకు తావిస్తోంది. రూ.కోట్లు విలువ చేస్తే ఈ స్థలాన్ని అమ్మకానికి పెట్టి నామమాత్రపు ధరతో కొట్టేసేందుకు ఇప్పటికే ఎత్తులు వేశారు. ఇందుకు అనుగుణంగానే బుధవారం నిర్వహించే కౌన్సిల్‌లో అతి చిన్న అజెండాగా ప్రతిపాదన పెట్టి ఆమోదం పొందేలా పావులు కదుపుతున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక తరహాలో కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి అడ్డదారిలోనైనా కౌన్సిల్ ఆమోదం పొందేలా కుయుక్తులు పన్నుతున్నారు.

ఊసేలేని స్మార్ట్ సిటీ నిధులు

తిరుపతి స్మార్ట్ సిటీకి కాలం చెల్లింది. ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా విదల్చకపోవడంతో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీని రద్దు చేసింది. కేంద్రం నుంచి రూ.100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.310 కోట్లు తిరుపతి స్మార్ట్ సిటీకి విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కానీ కేంద్రం ఆ నిధులను ఇచ్చే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితులలో ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కేంద్రం స్మార్ట్ సిటీకి మంగళం పలికింది. ఈ క్రమంలో సుమారు రూ.500 కోట్లకు పైగా జరుగుతున్న అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణం 40 శాతం పనులు పూర్తి చేసుకుని ఆగిపోయాయి. ఈ పనులు పూర్తి చేయాలంటే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థిరాస్తిని అమ్మడం తప్ప మరో మార్గం లేదంటూ ఓ మంత్రి అధికారుల చేత చెప్పించారు. ఆయనకు వంతపాడుతున్న అధికారులు ఈ స్థలాన్ని అమ్మేందుకు రంగం సిద్ధం చేశారు. బుధవారం నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో తూతూ మంత్రంగా ఆమోద ముద్ర వేయించి ఆపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

విధి విధానాలు లేకుండా...

టెండర్‌కు వెళ్లాలంటే అందుకు సంబంధించిన విధి విధానాలు రూపొందించాల్సి ఉంటుంది. కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించాల్సినప్పుడు కౌన్సిల్‌లో అజెండాగా పెట్టే ముందు నిపుణులతో చర్చించాలి. సబ్ రిజిస్ట్రార్, ఆర్డీఓ, స్థానిక రెవెన్యూ అధికారులతో సమావేశమై ఆ స్థలానికి సంబంధించి ప్రభుత్వ విలువ ఎంత ? బహిరంగ మార్కెట్‌లో దాని వాస్తవ విలువ? టెండర్‌కు వెళ్లాలంటే సర్కార్ వారి పాట ప్రారంభ ధర ఎంత అని నిర్ణయించాల్సి ఉంది. ఇవేమీ లేకుండానే సరైన విధి విధానాలు రూపొందించకుండా ఆ స్థలాన్ని అమ్మేందుకు ప్రభుత్వ అనుమతి కోసం కౌన్సిల్ ఆమోదం అంటూ చిన్న అజెండా పెట్టడం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వ ఆస్తిని చౌకగా కొట్టేసేందుకు..

గాంధీ విగ్రహం సమీపంలోని మున్సిపల్ స్థలాన్ని కొట్టేసేందుకు గత టీడీపీ ప్రభుత్వంలోనే కొందరు ఎత్తులు వేశారు. ఆ ఎత్తులను అప్పటి వైఎస్సార్‌సీపీ నేతలు తిప్పికొట్టడంతో లీజు విషయాన్ని పక్కన పెట్టారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ స్థలాన్ని కొట్టేసేందుకు కుట్ర పన్నారు. ఓ మంత్రి అంతా తానై రూ.కోట్ల విలువ చేసే మున్సిపల్ స్థిరాస్తిని కాజేసేందుకు పక్కా ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే కౌన్సిల్ ఆమోదంలో వేలం పాట ప్రారంభ ధరను నిర్ణయించకుండా ఎత్తులు వేశారు. తీరా వేలం పాటలో ఎవరూ పాల్గొనకుండా అనుకున్న వాళ్లకు ఆ స్థలాన్ని తక్కువ ధరకే కొట్టేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ విలువ అంకనం రూ.2.40 లక్షలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో దాని విలువ అంకనం రూ. 12 లక్షల వరకు పలుకుతోంది. అలా 924 అంకనాల విస్తీర్ణం గల స్థలాన్ని బహిరంగం మార్కెట్ ప్రకారం విక్రయిస్తే రూ.110.88 కోట్లు వరకు కార్పొరేషన్‌కు సమకూరుతుంది. అయితే కౌన్సిల్ ఆమోదంలో వేలం పాట ప్రారంభ ధర నిర్ణయించకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు

కార్పొరేషన్ స్థలాన్ని విక్రయానికి పెట్టడంపై సోషల్ మీడియాలో కూటమి నేతలు, అధికారుల తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మడమేనా సంపద సృష్టి బాబూ... అంటూ కొందరు వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. అధికారుల తీరుపైనా మండిపడుతున్నారు. స్మార్ట్ సిటీ నిధులు విడుదల చేస్తే స్థిరాస్తిని అమ్మే దుస్థితి ఉండదు కదా...బాబూ అంటూ సెటైర్లు వేస్తున్నారు. అలానే మంత్రి నారాయణ, తిరుపతి ఎమ్మెల్యే తీరుపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఆస్తులను అమ్మితే ఒప్పుకునేది లేదంటూ వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు కమ్యూనిస్టు పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.

రెవెన్యూ బదిలీలలు'

- ఎనిమిది రోజుల తర్వాత బదిలీల వెల్లడి
- నేతల సిఫార్సు మేరకు 8 రోజుల కసరత్తు
- జిల్లాలో 18 మంది తహసీల్దార్ల బదిలీలు
- డీటీలు 22 మంది బదిలీ

తిరుపతి అర్బన్ : అన్ని శాఖలది ఒక లెక్క అయితే రెవెన్యూ శాఖ బదిలీలది మరో లెక్కగా ఉంది. ఈ నెల 9కి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. ఆ మేరకు పలు విభాగాలకు చెందిన బదిలీలను అధికారులు వెల్లడించారు. అయితే రెవెన్యూ శాఖలో జరిగిన బదిలీలు మాత్రమే ప్రక్రియ పూర్తి అయిన 8 రోజుల తర్వాత వెల్లడించడంపై పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. కూటమి నేతలు ఇచ్చిన జాబితా మేరకు సర్దుబాటు చేయడానికి సమయం పట్టినట్లు జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. మొత్తంగా మంగళవారం రెవెన్యూకు చెందిన బదిలీలు వెల్లడించారు. తహసీల్దార్లు 18 మంది, డిప్యూటీ తహశీల్దార్లు 22 మంది జిల్లాలోనే పక్క మండలాలకు సర్దుబాటు అయ్యారు. అయితే ఆర్ఐ, వీఆర్వోల జాబితా మాత్రం వెల్లడించలేదు. మరో ఒకటి రెండు రోజులు సమయం పట్టేలా ఉంది.

జిల్లాలో 18 మంది తహసీల్దార్లు బదిలీ

సర్వీస్‌తో నిమిత్తం లేకుండా జిల్లాలో ఇటీవల బదిలీపై వచ్చిన వారిని సైతం మార్పు చేశారు. ప్రధానంగా స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిందంతా చేయకపోవడంతో కొందరికి బదిలీ వేటు తప్ప లేదు. జిల్లా కేంద్రమైన, మారుమాల మండలంలో పని చేస్తున్న తహసీల్దార్ అయినా ఇదే జరిగినట్లు చర్చ సాగుతోంది. మొత్తంగా జిల్లాలో 18 మంది తహసీల్దార్లు, 22 మంది డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు.

తహసీల్దార్ పేరు	పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన మండలం
కేవీ భాగ్యలక్ష్మి	తిరుపతి అర్బన్	చిన్నగొట్టిగల్లు
కే.జనార్దన్‌రాజు	చిన్నగొట్టిగల్లు	శ్రీకాళహస్తి
ఎం.రోశయ్య	కలెక్టరేట్ ఆఫీస్	కేవీబీపురం
వై. రమేష్‌బాబు	పిచ్చాటూరు	కలెక్టరేట్ పరిపాలన విభాగం
జి.చంద్రశేఖర్‌రెడ్డి	చిత్తూరు అర్బన్	రేణిగుంట
వి.సురేష్‌బాబు	రేణిగుంట	తిరుపతి అర్బన్
పి.భారతి	కలెక్టరేట్ ఆఫీస్	తొట్టంబేడు
యు.మధుసూదన్‌రావు	తొట్టంబేడు	కలెక్టరేట్ ఆఫీస్
టీవీ సుబ్రమణ్యం	సత్యవేడు	పిచ్చాటూరు
పి.రాజశేఖర్	వరదయ్యపాళెం	సత్యవేడు
సీ. శ్రీదేవి	శ్రీకాళహస్తి ఆర్డీవో ఆఫీస్	బీఎన్ కండ్రిగ
డి. లక్ష్మీనారాయణ	శ్రీకాళహస్తి	కలెక్టరేట్ ఆఫీస్
ఎస్వీ నరసింహులు	సూళ్లూరుపేట	వెంకటగిరి
ఏ.ద్వారకానాథ్‌రెడ్డి	పెళ్లకూరు	కలెక్టరేట్ ఆఫీస్
సయ్యద్ ఇక్బాల్	కందుకూరు	కలెక్టరేట్ ఆఫీస్
సీహెచ్ హరికృష్ణ	కలెక్టరేట్ ఆఫీస్	పెళ్లకూరు
కే.శ్రీనివాసులు–	చిల్లకూరు(డీటీ)	చిల్లకూరు తహసీల్దార్

ధరలు విఫలం!

దిగజారిన మామిడి ధర

- ర్యాంపుల్లో కేజీ రూ.3లే
- ఫ్యాక్టరీల వద్ద రైతుల పడిగాపులు
- టోకెన్ల కోసం గుడిపాలలో తొక్కిసలాట
- సొమ్మసిల్లిన రైతులు
- అడ్డగోలుగా దళారీ వ్యవస్థ
- పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం



టోకెన్ల కోసం గుడిపాల మండలంలోని ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీ ఎదుట గుమికూడిన రైతులు

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో తోతాపురి అవస్థలు తార స్థాయికి చేరాయి. అధిక దిగుబడిని సాకుగా చూపి అందినకాడికి దోచుకునేందుకు ర్యాంపులు తళుక్కుమంటున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 23కి పైగా ర్యాంపులు తెరపైకి వచ్చాయి. వీటిలో కొన్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. మరికొన్నింటికి రిజిస్ట్రేషన్లు లేవని అధికారులే చెబుతున్నారు. కోతలు పెరిగే కొద్దీ ర్యాంపులు తౌతాపురి కేజీ రూ.4 నుంచి రూ.3కు తగ్గిపోయింది. జిల్లా కేంద్రంలో అది కూడా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ర్యాంపులో కేజీ రూ.3కే కొనుగోలు చేస్తున్నారు. అలాగే చిత్తూరు రూరల్ మండలం, బంగారుపాళ్యం, పలమనేరు, పులిచెర్ల, జీడీనెల్లూరు, పెనుమూరు తదితర ప్రాంతాల్లోని ర్యాంపుల్లో కేజీ రూ.3కే ఫిక్స్ అయ్యారు. ర్యాంపుల్లో ఈ రకమైన దోపిడీ అధికమవుతున్నా సంబంధిత అధికారులుగానీ, కూటమి నేతలు గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

దళారుల దోపిడీ ఇలా..!

మామిడి పంట విషయంలో తమిళనాడు రాష్ట్రం చేతులెత్తేసింది. ఈ కారణంగా అక్కడ మామిడి ధరలు పూర్తిగా క్షీణించాయి. ప్రస్తుతం అక్కడి రైతులు తోతాపురి కేజీ.3కి విక్రయిస్తున్నారు. అయితే ఈ ధరలు దళారులకు కలిసొస్తోంది. వీరు గ్యాంగ్‌గా ఏర్పడి ఫ్యాక్టరీ నిర్వాహకులతో కుమ్మక్కై తమిళనాడు కాయలను రూ.3కు కొనుగోలు చేసి జిల్లాలోని ఫ్యాక్టరీలకు తీసుకొచ్చేస్తున్నారు. తమిళనాడు కాయలను ఇక్కడ కేజీ రూ.4, రూ.5కు విక్రయించి దళారులు దండుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక నిధి రూ4ను దోచుకోవడానికి కొత్తదారిని ఎంచుకున్నారు. దళారులకు మామిడి పంట లేకున్నా.. రూ.4 కోసం కొత్త దోపిడీని మొదలుపెట్టారు. ఏదో ఒక పట్టా పాసుపుస్తకాన్ని చూపిస్తున్నారు. ఇలా గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, చిత్తూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, ఎస్‌ఆర్ పురం తదితర మండల సరిహద్దు ప్రాంతాల్లో దళారులు రాజ్యమేలుతున్నారు.

సమయం లేదు మిత్రమా

మేలో సంవృద్ధిగా వర్షాలు కురిశాయి. ఈ వర్షానికి మామిడి పంట పక్వానికి వచ్చింది. రెండు వారాల్లో కోతలు కోయకుంటే ..మామిడికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే తోటలోని కాయలు రాలిపోతున్నాయి. టోకన్లు జూలై నెలాఖరు వరకు ఇస్తే.. అంతవరకు చెట్లోని కాయలు ఏమైపోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రేపు తిరుపతికి జాతీయ మహిళా కమిషన్ సభ్యులు

తిరుపతి అర్బన్ : తిరుపతికి జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్ గురువారం రానున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ మహిళా కమిషన్ సభ్యుల నేతృత్వంలో మీటింగ్ ఉంటుందని చెప్పారు. జిల్లాలోని మహిళలతో పాటు సమీప ప్రాంతాల్లోని ఇతర జిల్లాకు చెందిన మహిళలు వారి సమస్యలు ఉంటే కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యా దులు కమిషన్‌కు ఇవ్వవచ్చునని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బైక్, ఢీ

– ద్విచక్రవాహనదారుడికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ పరమేష్

కలువాయి (సైదాపురం) : మండలంలోని పర్లకొండలోని పెద్ద కాలువ (తెలుగు గంగ) సమీపంలో ట్రాక్టర్, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో తిరుమలపాడు గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు కటారి పరమేష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 ద్వారా చికిత్స నిమిత్తం పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తులరద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,681 మంది స్వామి వారిని దర్శించుకోగా 35,261 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.43 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో తిరుపతి రూరల్, అవిలాల ధనలక్ష్మీనగర్‌కు చెందిన జగన్నాథ్‌రెడ్డికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి రూరల్, కొప్పరవాండ్లపల్లికు చెందిన రామ్మూర్తి వద్ద జగన్నాథరెడ్డి కొంత సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. అతను ఆ సొమ్మును చెల్లించే క్రమంలో 2022 అక్టోబర్ 28వ తేదీ 6 లక్షలా50 వేల రూపాయలు విలువ చేసే చెక్కును రామ్మూర్తికి ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో అతను కోర్టులో జగన్నాథరెడ్డిపై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేయగా న్యాయమూర్తి జగన్నాథ్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు సొమ్ము ఆరు లక్షలా 50 వేల రూపాయలను నష్ట పరిహారం కింద చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కాలువలో స్నానానికి దిగి వ్యక్తి మృతి



బాలాజీ (ఫైల్)

వెంకటగిరి రూరల్ : స్నానానికి కాలువలోకి దిగి ఓ వ్యక్తి గల్లంతై మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని బంగారుపేట తెలుగు గంగ లింక్ కాలువ వద్ద మంళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని బంగారుపేటకు చెందిన సత్తల బాలాజీ (62) అలియాస్ చిన్న సుబ్బయ్య ఉదయం ఇంటి నుంచి బయలు దేరి తెలుగు గంగ కాలువ నుంచి కయ్యూరు చెరువుకు వెళ్లే లింక్ కాలువ వద్ద స్నానానికి దిగి గల్లంతయ్యాడు. బాలాజీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా కొందరూ జాలరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కాలువలో బాలాజీ మృతదేహాన్ని గాలించగా లభించింది.బాలాజీ మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది కాలువలో నుంచి వెలికి తీశారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఆటోను వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన తిరుపతి ఎర్రమిట్టకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీను రెడ్డికి రెండేళ్ల జైలుశిక్ష, 500 రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2016 డిసెంబర్ 4వ తేదీ తిరుపతి, టి.ఎం.ఆర్ సర్కిల్ సమీపంలో ఆటో డ్రైవర్ శ్రీనురెడ్డి ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న ధనపాల్ అనే వ్యక్తిని ఢీకొన్నాడు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ శ్రీనురెడ్డిని అరెస్టు చేసి తిరుపతి ఆరో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. నేరం అతడిపై రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ 2023 మార్చి మూడో తేదీ తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై అతడు స్థానిక పదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలుకు వెళ్లాడు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖాయం చేస్తూ తీర్పు వెల్లడించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని మతకాముడి గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన మతం మునిచంద్ర అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో పోలీసులు మంగళవారం నిందితుడు మతం ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మతకాముడి గ్రామానికి చెందిన మతం ప్రసాద్, మతం మునిచంద్ర(28) పక్క పక్కనే నివాసాలు. వీరు వరుసకు సోదరులు. సోమవారం రాత్రి మునిచంద్ర బెల్టు దుకాణంలో మద్యం తాగి ఇంటి వద్ద ఉంటున్న మహిళలు, ఇతర వ్యక్తులను అసభ్యకరంగా మాట్లాడాడు. ఈ విషయంపై ప్రసాద్, మునిచంద్రలకు వివాదం తలెత్తింది. దీంతో ప్రసాద్ ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని మునిచంద్రను పొడిచాడు. అక్కడికక్కడే మునిచంద్ర మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు మతం ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

'గిట్టుబాటు' కాని మాటలు

- మంత్రి హామీ నిలబెట్టుకోవాలి
- మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పాకాల : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న ప్రభుత్వం హామీ మాటల గారడీగా మారింది. మామిడి గిట్టుబాటు ధరకు గట్టి చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు గిట్టుబాటు ధరకు మామిడిని కొనుగోలు చెయ్యాలని సప్లయర్స్‌కు, ఫ్యాక్టరీ యజమానులకు బహిరంగంగా దామలచెరువులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో సూచనలు చేశారు. రైతులను మోసం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యేతో కలసి ప్రగల్భాలు పలికారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా కాపు కాచే తోతాపురిని రూ.8కు కొనుగోలు చెయ్యాలని, ప్రభుత్వం నుంచి రూ.4 ఇస్తామని మామిడి రైతులకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు మామిడి ధర రూ.4 దాటలేదు. ఫ్యాక్టరీలు అయితే నగదుకు కోసం సుమారు 3, 4 నెలలు ఆగాల్సిందేనని చెబుతున్నారు. మంగళవారం సప్లయర్స్ ర్యాంపుల వద్ద తోతాపురిని రూ.3కు కొనుగోలు చేయడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మామిడి కాయలను రూ.3కు అమ్మలేక..తోటల్లో కాపును ఉంచుకోలేక రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన సప్లయర్స్, ఫ్యాక్టరీ యజమానులు రైతులను దోచేస్తున్నారు. ముఖ్యమంత్రి మామిడి రైతులపై దయ ఉంచి గిట్టుబాటు ధర కల్పించాలని స్థానిక రైతులు వేడుకుంటున్నారు.

మామిడి రైతును ఇబ్బంది పెట్టొద్దు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ : జిల్లాలో మామిడి పంట రైతులకు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం కేవీబీపురం మండల కేంద్రంలోని దేవరాజ్ ఫ్రూట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ, బీఎన్‌కండ్రిగ సమీపంలోని రాస మామిడి గుజ్జు పరిశ్రమను కలెక్టర్ తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మామిడి రైతుల నుంచి ఎనిమిది రూపాయలకు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం అదనంగా నాలుగు రూపాయలు రైతులకు ఇస్తుందన్నారు.ఆయన వెంట సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, మండల తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో మాలతి, ఉద్యానవన సత్యవేడు అధికారి రాధారాణి పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : జేసీ



రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న జేసీ

పాకాల : మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని జేసీ శుభం బన్సల్ మంగళవారం దామలచెరువులోని ర్యాంప్ నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.3కు మామిడిని కొనుగోలు చేయడం సరికాదన్నారు. గిట్టుబాటు ధరకు మామిడిని కొనుగోలు చేయాలని కోరారు. అలాగే దామలచెరువులో ఉన్న అన్ని ర్యాంపులను తెరవాలని అన్నారు. ఫ్యాక్టరీల వద్ద మామిడి కాయలు తీసుకోవడం లేదని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. వారితో కూడా సంప్రదింపులు జరిపి మామిడి కాయలను తీసుకునేలా చర్యలు చేపడతామన్నారు. స్థానికంగా మామిడి రైతులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు గిట్టుబాటు ధరకు మామిడిని కొనుగోలు చేయాలని సూచించారు.